# హోటల్ రూం

## కొమ్మూరి వేణుగోపాలరావు



అది ఓ అధునాతనమైన హోటల్.

అందులో ఎన్నో గదులున్నాయి. ఆ గదుల్లో ఒంటరిగానూ, జంటలుగానూ, కుటుంబాలతోనూ, కుటుంబాలు కానివాళ్ళతోనూ ఎందరో మనుషులున్నారు. ఆ హోటల్లో పనిచేసే కుర్రాళ్ళుగానీ, బేరర్లుగానీ హడావుడిగా ఎప్పుడూ అటూ యిటూ పరుగులెత్తుతూనే ఉంటారు. హోటల్ ఆవరణలో ఎన్నో కార్లు బారులుతీరి ఆగి ఉంటాయి.

ఆ గదుల్లో...

తినేవాళ్ళు తింటూ ఉంటారు

పేకాడేవాళ్ళు ఆడుతూ ఉంటారు.

త్రాగేవాళ్ళు త్రాగుతూ ఉంటారు.

వినోదాలవాళ్ళు వినోదాల్లో మునిగి ఉంటారు

సినిమా కథలవాళ్ళు స్టోరీ డిస్కషన్‌లో కూర్చుంటారు.

సినిమాలు పూర్తిచేసిన ప్రొడ్యూసర్లు, అవి జిల్లాలవారీగా అమ్ముకోవటానికి చేసుకునే ఏర్పాట్లు ఆ గదుల్లోనే జరుగుతూ ఉంటాయి.

ఆ ఏర్పాట్లు ఎప్పుడు పూర్తవుతాయా అన్న తాపత్రయంతో వాళ్ళకు డబ్బు సర్దిన ఫైనాన్సర్స్ అక్కడ ఆరాటంగా తిరుగుతూ ఉంటారు.

ఆ గదుల్లో ప్రేయసీ ప్రియులుంటారు.

భార్యాభర్తలుంటారు.

భార్యాభర్తలుగా నటించేవాళ్ళుంటారు.

ఎన్నో బాధలవాళ్ళుంటారు.

అనేక గాథలతో బరువెక్కిపోయిన వాళ్ళుంటారు.

అలా బరువెక్కి, బరువెక్కి చావబోతున్నవాళ్ళూ ఉన్నారు.

* * *

ఓ రోజు రాత్రి ఎనిమిది గంటలకు ఓ యువకుడు చిన్న సూట్‌కేసుతో వచ్చి ఆ హోటల్లో ఓ సింగిల్ రూం తీసుకున్నాడు.

ఆ యువకుడికి పాతికేళ్ళుంటాయి


నాజూగ్గా, అందంగా ఉన్నాడు.

కాని దిగులుగా, దీనంగా ఉన్నాడు.

కౌంటర్‌లో పేరడిగితే 'నా పేరు కె. రమేష్ అని చెప్పాడు. బిజినెస్ రీత్యా వచ్చానని పుస్తకంలో రాశాడు. విజయవాడనుంచి వస్తున్నానని ఉదహరించాడు.

రూంలో కొచ్చాక తెల్లగా మెరుస్తోన్న ప్రక్కమీద పడుకుని కాసేపు ఆలోచించాడు. అతని వైఖరి చూస్తే జీవితంలోని ఆలోచనలన్నీ ఓ తీర్మానాని కొచ్చినట్లు గోచరించింది.

లేచి డోర్ లాక్‌చేసి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.




సూట్‌కేసులోంచి డైరీ తీశాడు. రాసుకుంటున్నాడు.

"జీవితంలో మంచిగా ఉండటానికి ప్రయత్నించి పిరికివాడిగా పరిణమించాను.

'మెతకదనం యీ సంఘంలో ఉండటానికి పనికిరాదని రుజువయింది.'

'ఎవరు ఏమడిగినా కాదనలేక సహాయాలు చేస్తూ నన్ను నేను పోగొట్టుకున్నాను.

'అతి మంచితనంవల్ల స్నేహితుల్ని తృప్తిపరచలేక అందరూ దూరమయేలా చేసుకున్నాను.

'ప్రేమకు కూడా గడుసుతనం అవసరమని తెలుసుకున్నాను.'

'ఆ గడుసుతనం లేక ప్రేమను జయించలేకపోయాను.

'ఆమె అందంగా ఉంటే ఉండవచ్చు. కాని పెళ్ళయిన స్త్రీతో నాకు పరిచయం ఎందుకు కలగాలి ?

'అసలామె మొదట్లో ఎంతో యాంత్రికంగా కనిపించింది — అలా ఉండిపోతే అప్పుడప్పుడు కలుసుకుంటూ, ఆనందాలు అందించుకుంటూ, అంతలోనే విడిపోతూ, ఎవరి జీవితం వాళ్ళు సాగించుకుంటూ- ఏమీ చికాకులు లేకపోయేవేమో.

'నా సున్నితత్వంతో ఆమెను సున్నితమైన దానిగా చేసేశాను.

'నా సెంటిమెంట్సుతో ఆమెను సెంటిమెంటల్ చేసేశాను.

'యిద్దరం మానసికంగా నలిగిపోయాం.

'స్వార్థం మొగవాడ్ని చేస్తోంది- పశ్చాత్తాపం మనిషిని చేసేస్తోంది.

'ఇహ భరించలేని స్థితికి వచ్చింది. ఈ జీవితంమీద అరుచి జనించింది— అందుకే అంతం చేసుకుంటున్నాను ''

డైరీ మూసి సూట్‌కేసులో పెట్టాడు. ఓ మూలనుంచి నిద్రమాత్రల సీసా తీశాడు. అందులో ఎన్నో నిద్రమాత్రలుంటాయి. ముప్ఫయికి పైగా ఉండవచ్చు. జగ్‌లోంచి గాజుగ్లాసులోకి నీళ్ళు వొంపుకుని ఆ మాత్రలన్నీ తడవకి నాలుగయిదు చొప్పున గబగబా మింగేశాడు.

గదిలో అటూ యిటూ తిరుగుతున్నాడు.

ఇహ కాసేపట్లో చచ్చిపోతానా ?

చావంటే ఎలా ఉంటుంది ?

చచ్చిపోయి నన్ను నేను చూసుకోగలుగుతానా ?

కొంచెం భయంవేస్తోంది. మళ్ళీ అంతలోనే ధైర్యాన్ని పుంజుకున్నాడు.

మొదట ఎలా ఉంటుంది ? నిద్ర వస్తుందా ? తన కిప్పుడు నిద్ర వస్తున్నదా ?

టైమెంతయింది ?

ఏమీ తెలియటం లేదేమిటి ? భయం తెలియటంలేదు, బాధా తెలియటంలేదు. శూన్యంగా ఉంది మనసు జీవితంలో ఎప్పుడూ యింత హాయిగా లేదు.

ఎంత మంచి నిద్ర.

ఇలా ఎప్పుడూ యిదివరలో అనుభవం కాలేదేం ? తను ఎక్కడ ఉన్నాడు ? తెలుసుకోవాలని లేదు. ఏమీ చెయ్యాలని లేదు.

"నాకు తెలివి ఉంది. తెలివి తప్పానను కోవటం అబద్ధం.

అన్నీ తెలుస్తున్నాయి. అంతా బాగానే ఉంది.

ఇక్కడ్నుంచి కదలాలని లేదు. యిలాగే ఉండిపోవాలనిపిస్తోంది.

* * *

ఎవరో తలుపులు తడుతున్నారు.

'సార్! సార్' అని పిలుస్తున్నారు.

కాసేపాగి బజర్ నొక్కారు.

స్పష్టంగా వినిపిస్తున్నాయి. లేవాలనుకున్నాడు. లేవాలనిలేదు.

బయట కలకలం ఎక్కువవుతోంది. పదిమంది మనుషులదాకా గుమిగూడినట్లున్నారు.

గట్టిగా పిలుస్తున్నారు.

టైమెంతయింది ? అర్ధరాత్రిపూట ఎందుకిలా పిలుస్తున్నారు.

కిటికీ తెరల వెనకనుంచి ఆ వెల్తురేమిటి ? అసలెప్పుడు తెల్లవారింది.

జవాబుగా పలకా లనుకున్నాడు. గొంతు రావటంలేదు.

బయట తాళంచెవి త్రిప్పుతున్నారు ...తలుపు తెరుచుకుంది. గబగబ పదిమంది లోపలికి వచ్చారు.

అతన్ని తట్టి లేపుతున్నారు. రకరకాల గొంతులు.



"ఏయ్ మిస్టర్. ఏయ్ మిస్టర్."

"మిస్టర్ రమేష్. మిస్టర్ రమేష్."

"ఏం జరిగింది ? కదలడేం ?"

ఒకరు చెయ్యి పట్టుకుని చూశారు. ఇంకొకరు కనురెప్పలు తెరిచి తెలుసుకోవటానికి ప్రయత్నించారు.

"లాభంలేదు. అయిపోయింది."

"ఏమిటి ?"

"చచ్చిపోయాడు."

"ఆ ప్రక్కగదిలో ఎవరో డాక్టరుగారున్నారు. పిల్చుకురండి !"

కాసేపట్లో డాక్టరుగా రొచ్చారు. పల్స్ చూశాడు. గుండె పరీక్షించాడు. తలపంకించాడు.

"చనిపోయాడు" అని ప్రకటించాడు.

హోటల్ ప్రొప్రయిటర్ చెమటలు క్రక్కుతున్నాడు.

"పోలీసులకి ఫోన్ చెయ్యండి. ఫోన్ చెయ్యండి" అని అరుస్తున్నాడు.

అన్నీ తనకి తెలుస్తున్నాయి.

తను చచ్చిపోయాడంటా రేమిటి ? "మీ మాటలు నాకు వినిపిస్తున్నాయి. నేను బ్రతికే ఉన్నాను. మీ మాటలన్నీ వింటున్నాను" అని చెప్పాలని ఉంది.

మాట రావటంలేదు.

పోలీసులు వచ్చి తనని తీసుకు వెడతారా ? బ్రతికి ఉన్న తనని పోస్ట్ మార్టం చేస్తారా ?

డాక్టరెందుకు పొరబడ్డాడు !!

ఇంకా ఎవరెవరో మనుషులు వస్తున్నారు. అతన్ని గురించి వింతగా చెప్పుకుంటున్నారు.

ఉన్నట్లుండి తృళ్ళిపడ్డట్లయింది.

పద్మ !

పద్మ యిక్కడి కెలా వచ్చింది ? ప్రక్కన ఆమె భర్త ఉన్నాడు. అతన్తో నా కెక్కువ పరిచయం లేదు. కాని నే నెవరో అతనికి తెలుసు.

'ఈ స్థితిలో నన్ను చూసి పద్మ ఏమయిపోతుంది ?'

ఆమెనే గమనిస్తున్నాను.

ఒక్కక్షణంలో ఆమె ముఖం నల్లబడిపోయింది. అంతలో కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

కాసేపట్లో వెక్కి వెక్కి ఏడ్చేస్తోంది.

"నేను చచ్చిపోలేదు పద్మా" అని చెప్పాలని ఉంది. కాని సాధ్యంకావటం లేదు.

ఆమె భర్త అయోమయంలో పడిపోయాడు. ఆమె భుజంమీద చెయ్యి వేసి అవతలకు తీసుకెళ్ళాలని ప్రయత్నిస్తున్నాడు. కాని ఆమె కదలటంలేదు.

అతని పెదవులు కదిలాయి. "ఊరుకో – ఇతను నీకు తెలుసని తెలిస్తే పెద్ద గొడవవుతుంది. పోలీసులు నిన్ను ప్రశ్నలతో కాల్చేస్తారు" అన్నట్లుగా ఉంది ఆ కదలిక.

అతన్ని చూస్తే జాలేసింది. అతను అమాయకుడేం కాదు, దుర్మార్గు డంతకన్నా కాదు. కాని ఆ స్థితిలో ఏం చేస్తాడు ? ఆ స్థితిలో అసలు ఏ భర్త మాత్రం ఏంచేస్తాడు ?

అంతా వాళ్ళవంక చిత్రంగా చూస్తున్నారు. "ఆ అమ్మాయి ఎందుకలా ఏడుస్తుంది ? ఇత నెవరో తెలుసా ?"

ఆ చూపుల్లో భావం అత నర్థం చేసుకున్నాడు. "నా మిసెస్! మనసు చాలా మెత్తన. ఇలాంటి సంఘటనలు తట్టుకోలేదు...రా పద్మా. నీ కీ స్థితిలో విశ్రాంతి చాలా అవసరం."

ఆమెను పొదివి పట్టుకుని బయటకు తీసుకుపోయాడు.

వాళ్ళెక్కడ ఉన్నారు ? ప్రక్కగదుల్లో ఎక్కడైనా ఉన్నారా ? అసలెప్పుడొచ్చా రిక్కడికి ?

వెళ్ళి వాళ్లేం చేస్తున్నారో చూడాలనిపించింది.

కాని వెళ్ళలేకపోతున్నాను. ఎందుకని ? నాకేం జరిగింది ? నేనన్నీ తెలుసుకోగలుగు తున్నాను. కానీ అనుకున్నట్లు ఏమీ చెయ్యలేకపోతున్నానేం ?"

పద్మ నేంచేస్తున్నాడో అతను ? కొడుతున్నాడా ? బుజ్జగిస్తున్నాడా ? ఆరాలు తీస్తున్నాడా ?

బయట బూట్ల చప్పుడు. "పోలీసులు, పోలీసులు" జనంలో కలకలం. గబగబా ఎక్కడివాళ్ళక్కడ తప్పుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

ఒక ఎస్.ఐ వెంట కొందరు కానిస్టేబుల్స్ లోపలకు వచ్చారు. చకచక వాళ్ళ తతంగం అంతా పూర్తి చేసేస్తున్నారు. అక్కడున్నవాళ్ళని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నారు. అతని శరీరానికి ఫొటోలు తీశారు.

అంతా పూర్తయాక "ఇప్పుడు డెడ్‌బాడీని జనరల్ హాస్పిటల్‌కు తీసు కెళ్ళాలి. అక్కడ పోస్ట్‌మార్టం జరుగు తుంది. ఈ సూట్‌కేసూ యివన్నీ పోలీస్ స్టేషన్‌కు తీసుకురండి" అన్నాడు ఎస్. ఐ.

అతని గుండె గుభేలు మన్నట్లయింది. తన శరీరాన్ని పోస్ట్‌మార్టం చేస్తారా ? అంటే పరపర కోసేస్తారన్నమాట. తను బ్రతికే ఉన్నాడని ఒకరూ గుర్తించరేం ?

శరీరాన్ని తీసుకెళ్ళటానికి ఓ స్ట్రెచర్ లాంటిది తీసుకొచ్చారు.

ఇంతలో ప్రక్కగదినుండి పద్మ భర్త పరిగెత్తుకు వచ్చాడు. ఆయాసంతో వగరుస్తున్నాడు.

"నా భార్య కదలటంలేదు. నాకేదో భయంగా ఉంది. ప్లీజ్ రండి."

వెంటనే పోలీసులు అటు పరిగెత్తారు. జనం వాళ్ళవెంట పడ్డారు.

పద్మ కేం జరిగింది ? ఎందుకు కదలటంలేదు ?

కొంతసేపు గడిచింది. ఎస్. ఐ. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ గదిలోకి వచ్చాడు. వెనక కానిస్టేబుల్స్.


"ఆమె చనిపోయింది. పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయి. ఆమె భర్తని కస్టడీలోకి తీసుకోండి. డెడ్ బాడీని జి.హెచ్. కి పంపించండి. పోస్ట్ మార్టం చేయించాలి."

తల తిరిగినట్లయింది. పద్మ చని పోయింది - పద్మ ! ప...ద్మ ! ప...ద్మ !

మెల్లిగా శరీరంలోకి వొణుకు ప్రవేశి స్తోంది. కనురెప్పలు రెపరెపలాడు తున్నాయి. అవయవాలు కదులు తున్నాయి.

"సా...ర్" కానిస్టేబుల్ కంగారుగా అరిచాడు.

జరిగేది గ్రహించి ఎస్. ఐ. అతని ముఖంలోకి చిత్రంగా చూస్తున్నాడు.



"కాల్ ది డాక్టర్, కాల్ ది డాక్టర్."

డాక్టర్ వచ్చి పరీక్ష చేయబోయే సమయానికి అతను కళ్ళు తెరిచి చూస్తున్నాడు.

"దాహం ...దా...హం" చిత్రం ! తను మాట్లాడగలుగుతున్నాడు.

నోట్లో మంచినీళ్ళు పోశారు.

నీరసంగా ఉంది. కానీ అన్నీ చేయ గలుగుతున్నాడు - మాట్లాడగలుగు తున్నాడు.

"పద్మ...ప...ద్మ..."

అంతా గుమిగూడి అతనివంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఎంతటి చిత్రం ! చచ్చిపోయిన మనిషి ఎలా బ్రతికాడు ?

"పద్మ...ప...ద్మ."

"పద్మెవరు ? ప్రక్కగదిలో అమ్మాయా ? ఆమె చనిపోయింది మిస్టర్. డాక్టర్ ! ఎలా ఉన్నాడు ?"

"హి యీజ్ ఆల్‌రైట్. వీక్‌గా ఉన్నాడు. గ్లూకోజ్ ఎక్కిస్తే సరి పోతుంది."

"వెరీగుడ్. ఇతన్ని వెంటనే హాస్పిటల్‌లో ఎడ్మిట్ చెయ్యండి. కస్టడీలోనే ఉంచండి" ఎస్. ఐ పురమాయించాడు.

ఒక వైపునుంచి అతన్ని హాస్పి టల్‌కి తీసుకెళ్ళటానికి ప్రయత్నాలు జరుగుతూంటే, మరోవైపు పద్మ మృత కళేబరాన్ని పోస్ట్‌మార్టంకు తీసుకువెళ్ళే ఏర్పాట్లు జరుగుతున్నాయి.